ఎంఎల్‌ఎ వేగుళ్లను కలిసిన కార్పొరేషన్ల డైరెక్టర్లు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండపేట రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మండపల్లి చంద్రశేఖర్(దొరబాబు), రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కపిలేశ్వరపురం మండలం మాచర గ్రామానికి చెందిన గుడాల జయబాబు కుటుంబ సమేతంగా ఆదివారం మండపేట టిడిపి కార్యాలయంలో ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావును కలిశారు. ఈ సందర్భంగా వారు తమపై నమ్మకంతో డైరెక్టర్ పదవి రావడానికి కృషి చేసిన ఎంఎల్‌ఎ వేగుళ్లను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, మాజీ సొసైటీ అధ్యక్షులు మల్లిపూడి గణేష్, మండపేట మండల అధ్యక్షులు యరగతపు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ వేగుళ్లకు సత్కారం

ఆక్రమణల చెరలో పంట కాలువలు

- అనధికార వంతెనలతో సాగునీటికి ఇక్కట్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి - రాజోలు

కోనసీమలో తాగు, సాగునీరంతా కాలువలపైనే ప్రధానంగా ఆధారపడుతుంది. రాజోలు పరిధిలోని తాటిపాక నుంచి సఖినేటిపల్లి వరకు పి.గన్నవరం ప్రధాన పంట కాలువను ఆనుకుని ఉన్న ఉపకాలువలు, పిల్లకాలువల ద్వారా వేల ఎకరాలకు సాగునీరు, ఐదు తాగు నీటి ప్రాజెక్టులకు మంచి నీరు ఈ కాలువల ద్వారానే సరఫరా అవుతుంది. అయితే ఈ కాలువల దుస్థితి రోజురోజుకూ అధ్వాన్నంగా మారుతుంది. ప్రధానంగా ఉప కాలువలు, పిల్లకాలువల వెంట ఆక్రమణలు పెరిగిపోవడంతో కాలువల నిడివి తగ్గిపోవడంతో నీటి సరఫరాలో ఇబ్బందులతో పాటు ఆక్రమించిన వారు. చెత్త, వ్యర్థాలు కాలువల్లో వేయడంతో పంట కాలువలు మురుగుకాలువల వలే దర్శనమిస్తున్నాయి. దీంతో రైతులతో పాటు ఈ కాలువల ద్వారా నీరు తాగునీటి ప్రాజెక్టులకు చేరడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంట కాలువల చెంత అక్రమ నిర్మాణాల చింత

రాజోలు మండలం తాటిపాక నుండి మలికిపురం వరకు ప్రధాన పంట కాలువ చెంత అక్రమ నిర్మాణాలు వెలిసి సాగునీటి కాలువను ఆక్రమిస్తున్నారు.దీనికి తాటిపాక, మెగలికుదురు, గెద్దాడ, వేగివారిపాలెం, కడలి, మలికిపురం పంచాయతీలకు చెందిన వారు అక్రమ నిర్మాణాలకు అనుమతులు తెచ్చుకుంటున్నారు. తద్వారా అక్రమ నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.రాజోలు మండలంలోని శివకోటి నుంచి దిండి రామరాజులంకకు సాగునీరందించే కాలువ వెంట ఇటీవల ఆక్రమణలు పెరిగాయి. ఇటీవల స్థానికంగా 216 జాతీయ రహదారి విస్తరణ పనులు చేయడంతో రహదారి వెంట వ్యాపారాలకు అనువుగా ఉంటుందని భావించిన కొందరు కాలువ వెంట తాత్కాలిక నిర్మాణాలు ఏర్పాటు చేశారు.రాజోలు- శివకోటి ప్రధాన పంటకాలువపై రైతుల ఆందోళనతో వంతెనలు తొలగించిన మురుగునీటి గొట్టాలు ధ్వంసం చేయకపోవడంతో పంట కాలువ మురుగుకాలువలా దర్శనమిస్తుంది.రాజోలు మటపర్రి కాలువ, సఖినేటిపల్లిలోని అంతర్వేది ఎల్‌ఎఫ్ ఛానల్ వెంట పలు చోట్ల నిర్మాణాలు ఉన్నాయి.

ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం

రాజోలు శివకోడు పంట కాలువలపై ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించాం. ఏ వంతెన నిర్మాణానికి మేం అనుమతి ఇవ్వలేదు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా. వీటి తొలగింపునకు రెవెన్యూ, పోలీసు, స్థానిక పంచాయతీ సహకారం కావాలి. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆక్రమణలు తొలగిస్తాం. వంతెనలు, నిర్మాణాలకు సంబందిత పంచాయతీ వారు అనుమతులు ఇవ్వడంతో తమ సిబ్బందిని అక్రమదారులు పట్టించుకోవడం లేదు.

-రమేష్ బాబు, ఇరిగేషన్ ఎఇఇ

తాటిపాక -మలికిపల్లి పంటకాలువ స్థలంలో అక్రమ నిర్మాణాలు

శివకోడు లో జాతీయ రహదారి216ని ఆనుకుని అక్రమ నిర్మాణం

అనధికార వంతెనలు

మలికిపురం మండల కేంద్రంలో మలికిపురం పంట కాలువపై అనుమతులు లేకుండా అనధికారికంగా పలు వంతెనలు నిర్మించారు. స్థానిక ఎత్తు వంతెన నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం మీదుగా వినాయకుడి ఆలయం వరకు సుమారు కిలో మీటరు మేర విస్తరించి ఉన్న ఈ కాలువ పై ప్రస్తుతం 30కి పైగా వంతెనలు ఉన్నాయి.అసలు పంట కాలువ కనిపించని పరిస్థితి ఉంది. ఆయా దుకాణాల వారు ఎవరి తిన్నగా వారు కాలువపై అనుమతులు లేకుండా ఈ కాలువ నుంచి అనుసంధానమైన మొండికోడు పంట కాలువ ద్వారా మలికిపురం, వివిమెరక, మోరిపోడు. తదితర గ్రామాల్లో సుమారు 400 ఎకరాలకు సాగు నీరందుతుంది.

రాజోలు నుంచి శివకోటి వరకు కిలోమీటర్ల విస్తీర్ణంలో..

రాజోలు మండలం రాజోలు నుంచి శివకోటి వరకు కిలోమీటర్ విస్తీర్ణం ఉన్న పంటకాలువ పై 90 వంతెనలు నిర్మించారు. ఈ కాలువపై 1495 ఎకరాలకు సాగునీరు అందుతుంది.కనీసం పంట కాలువకు మరమ్మతులు చేయడానికి కూడా వీలు లేని పరిస్థితి. ఎవరికి వారే అనుమతులు లేకుండా వంతెనలు నిర్మిస్తుంటే అధికారులు కూడా ఏమీ పట్టించుకోక పోవడం దారుణమని రైతులు అంటున్నారు. బట్టేలంక రెంజర్ 1, 2 గూడపల్లి రెంజర్ 12 పంట కాలువలు, మోరి, మట్టపర్రు రామరాజులంక పంట కాలువ గట్లు కూడా ఆక్రమణలకు గురయ్యాయి. గన్నవరం ప్రధాన పంట కాలువ గట్టుపలు చోట్ల ఆక్రమణలకు గురైంది. మలికిపురం పంట కాలువపై ఉన్న అనధికార వంతెనలను తొలగించి పంట కాలువను శుభ్రం చేయాలని ఈ పంట కాలువపై సాగు చేస్తున్న రైతులు కోరుతున్నారు.

అడిగే వారు లేకపోవడంతో

వందేళ్లకు పూర్వం నిర్మించిన ఆనకట్టలు, బ్యారేజీలు, లాకులు, షట్టర్లు, టన్నెళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువలు కూడా చాలాచోట్ల మేటలు వేశాయి. నాచు, తూటి, గుర్రపు డెక్క, రెల్లుగడ్డి పెరిగాయి. కాలువగట్లు బలహీనంగా ఉన్నాయి. చాలా చోట్ల గండ్లు పడుతున్నాయి. మరికొన్ని చోట్ల కాలువగట్లపై మట్టితవ్వుకుపోవడం జరుగుతోంది. అప్పుడప్పుడు అరకొరగా మరమ్మతులు చేస్తున్నప్పటికీ కట్టుదిట్టమైన రక్షణచర్యల్ని ప్రభుత్వం చేపట్టడం లేదు. చాలాచోట్ల ఈ కాలువగట్లుపైన ఆలయాలు, మండపాలు నిర్మించబడుతున్నాయి. మరికొన్ని చోట్ల శాశ్వత ప్రాతిపదికన పక్కా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఇరిగేషన్ పిడబ్ల్యుడి వారుగాని, ప్రభుత్వ అధికారులుగాని వీటిపై ఏ విధమైన చర్యలు చేపట్టడం లేదు. ఇదివరలో ఈ కాలువలపైన అజమాయిషీ చేసే డెల్టా కలాసులు, మైలు కూలీలు ఉండేవారు. ఆ సిబ్బంది ఇప్పుడు ఎక్కడ లేదు. పవిత్రమైన, ప్రాణాధారమైన కాలువల నీరు ఇన్ని రకాలుగా కాలుష్యం అవుతున్నందున ప్రభుత్వ యంత్రాంగం ఇంతవరకు ప్రదర్శిస్తున్న నిర్లిప్తతను ఇకనైనా విడనాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శివకోటి-రాజోలు పంట కాలువపై అనధికార వంతెన

సిపిఎం కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆంద్ర మాల్యాద్రి

మహాధర్నా జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక, రైతు విధానాలు నిరసిస్తూ ఈనెల 26న కలెక్టరేట్ల వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నా ను జయప్రదం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన ఆదివారం సిఐటియు, కెవిపిఎస్ మరియు వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాల్యాద్రి అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికుల, దళిత, బలహీన వర్గాలపై మోయలేని ఆర్థిక భారం మోపుతూ, కార్పొరేట్ సంస్థలకు అయాచితంగా దేశ సంపదను దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. ఈ విధానాలు నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన దేశవ్యాప్తంగా అఖిల భారత కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, కౌలు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు మరియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల కలెక్టరేట్‌ల వద్ద జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో మార్కెట్‌ను ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఊరికి దూరంగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాము బాలయ్య, దొమ్మే టి.వీరరాఘవులు, నిమ్మకాయల వెంకటేష్, యలమంచిలి బాలరాజు, కె.లక్ష్మణ, ఎవి.రమణమ్మ, ఉమాదేవి, అరుణ కుమారి పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి - కొత్తపేట

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్ జిల్లా సెలక్షన్స్‌లో కొత్తపేట మండలం గంటి జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు ఇన్చార్జి హెచ్‌ఎం. బండారు శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. తాటిపాకలో శనివారం జరిగిన సెలక్షన్స్‌లో కె.మనోజ్ ఎస్.పూర్ణచందు, ఎస్.మాధురి, బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు త్వరలో మచిలీపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. అదేవిధంగా జి.హర్షిత, టి.మనోజ్, ఎస్.అక్షయ్ రజిత పథకాలు సాధించినట్లు చెప్పారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాట్లాడుతున్న శ్రీనివాస్, తదితరులు

ప్రజా సమస్యలపై జగన్ స్పందించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

బాధ్యత కలిగిన రాజకీయ నాయకునిగా, ఒక ఎంఎల్‌ఎగా ప్రజా సమస్యల పట్ల వైఎస్.జగన్ స్పందించాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి కేతా శ్రీనివాస్, టిడిపి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కాసా విజయకుమార్, టిడిపి మండల బిసి సెల్ అధ్యక్షులు చెల్లబోయిన సింహాచలం పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్యానికి బద్దులుగా అసెంబ్లీ సమావేశాలు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరు ఆదర్శమని, గత వైసిపి ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిన తీరు ఒక మాయని మచ్చగా ప్రజల గుండెల్లో నిలిచి పోయిందని అన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమేన్నారు. అయితే వినడా నికి అసభ్య కరంగా ఉండే పదజాలంతో కుటు ంబ సభ్యులపై దాడి చేయడం వంటి తప్పుడు విధానాన్ని వైసిపి నుంచే మొదలైం దని వారు అన్నారు. గత వారంలో జరిగిన అసెంబ్లీ సమావేశాలను చూసిన వారికి, గత ప్రభుత్వ అసెంబ్లీ సమావేశాలకి, ప్రస్తుత కూటమి ప్రభు త్వం అసెంబ్లీ సమావేశాలకు వ్యత్యాసం కనబడుతుం దన్నారు. ప్రజా సమస్యల పట్ల జగన్ స్పందించకపోతే వచ్చేసారి ఆ 11 సీట్లు కూడా రావని వారు హెచ్చరించారు.

కార్టూ'నిజం'


విచారణ ఆలస్యమైతే నిజం కుళ్లిపోతుంది



వైద్యం వికటించి మహిళ మృతి

న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి - రాజోలు

వైద్యం వికటించి మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం రాజోలు గ్యాస్ కంపెనీ రోడ్డులో చైత్ర హాస్పిటల్ నందు జరిగింది. వివరాల్లోకి వెళితే మలికిపురం మండలం అడవి పాలెం గ్రామానికి చెందిన కందికట్ల మంగాదేవి (45) అను ఆమె గర్భసంచిలో కణితి ఉన్న కారణంగా శనివారం మధ్యాహ్నం రాజోలు చైత్ర హాస్పిటల్ కు వచ్చింది. ఆదివారం ఉదయం 8 గంటలకు ఆమెకు ఆపరేషన్ చేయడానికి ఆపరేషన్ థియేటర్ కు తీసుకుని వెళ్లారు. ఎనస్తీషియా(మత్తు) ఇచ్చే సమయంలో ఆమెకు రెస్పిరేటరీ ఫెయిల్యూర్ అవ్వడంతో ఆపరేషన్ థియేటర్‌లోనే చనిపోయింది. మంగాదేవి మరణ వార్త విషయం తెలుసుకున్న ఆమె బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. గైనకాలజిస్టు డాక్టర్ అప్పారి లావణ్య నిర్లక్ష్యం వల్లే మంగాదేవి చనిపోయిందని కుటుంబ సభ్యులు, బంధువులు, వివిధ దళిత సంఘాల నాయకులు ఆసుపత్రి గేటు వద్ద బైఠాయించారు. మంగాదేవి మృతికి కారణమైన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, మృతిరాలు కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు

రూ.6 లక్షల పరిహారం ఇస్తామన్న ఆసుపత్రి యాజమాన్యం

గతంలో కూడా ఇలాంటి సంఘటలు ఈఆసుపత్రిలో జరిగాయని అనుభవం లేని వారసత్వపు వైద్యం వలనే ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపించారు. మృతురాలి కుటుంబానికి రూ.6 లక్షలు ఆర్థిక పరిహారం అందిస్తామని ఆసుపత్రి యాజమాన్యం తెలపడంతో వివాదం సర్దుమణిగింది.

'యెరుబండి' ఆత్మీయ కలయిక ఆదర్శం

బడుగువానిలంకలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బండారు

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రతి ఏటా నిర్వహించే యెరుబండి వారి ఆత్మీయ కలయిక పలువురికి ఆదర్శంగా నిలుస్తుందని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు అన్నారు. బడుగువానిలంకలో యెరుబండి ధర్మరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ కలయిక కార్యక్రమంలో వారు ఆదివారం ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం మీద వివిధ ప్రదేశాల్లో నివాసాలు ఉంటున్న యెరుబండి కుటుంబీకులు ఈ కార్తీక వన సమారాధనతో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆయన వెంట కూటమి నాయకులు రామానుజుల శేషగిరిరావు, పాలూరి గోవిందరాజు, దూలం రాంబాబు, పడాల అమ్మిరాజు, తదితర నాయకులు ఉన్నారు. **మామిడికుదురు:** బడుగువాని లంకలో ఆదివారం ఏర్పాటు చేసిన యెరు బండి వంశీయుల కార్తీక వన సమారాధనకు ఈదరాడ నుంచి 300మంది యెరుబండి కుటుంబ సభ్యులు బయలుదేరి వెళ్లారు. మూడవ వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటుచేసిన ఈ సమ్మేళనంలో సుదూర ప్రాంతాల్లో ఉన్న యెరుబండి కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరేం దుకు ఈ సమ్మేళనం దోహదం పడుతుందని వారు పేర్కొన్నారు.

ఈదరాడ నుంచి వెళుతున్న 'యెరుబండి' వంశీయులు

సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - రాజోలు

అధికారులు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో, అధికారులు సమన్వయమై ప్రజా సమస్యల పరిష్కారానికి కషి చేయాలని రాజోలు ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు ఎంపిపి కేతా శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం రాజోలు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరా, గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. విద్యుత్ అధికారులు ఆక్వా రంగానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని అటువంటివి తక్షణమే మానుకోవా లన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలన్నారు. తాగునీరు సక్రమం గా అందించాలన్నారు. ఇకపై నిధుల కోసం తాను చూసుకుంటానని అభివృద్ధిపై అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలన్నారు. పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్ఎస్ఎస్.ప్రసాద్, ఎంపిడిఒ రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యురాలు మట్టా శైలజా, వైస్ ఎంపిపిలు ఇంటిపల్లి ఆనందరాజు, పొలమూరి శ్యాంబాబు, పలువురు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్


ఎంఎల్‌ఎ దాట్లను సత్కరిస్తున్న ధర్మారావు

రజక సంఘాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రజక కార్పొరేషన్ నిధుల ద్వారా అభివద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని కార్పొరేషన్ డైరెక్టర్ గొల్లపల్లి ధర్మారావు పేర్కొన్నారు. మండలానికి చెందిన ధర్మారావు పార్టీ అధికారంలోకి రావడానికి చేసిన కృషిని గుర్తించి రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించింది. ఆదివారం మురమళ్ళలోని క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మారావు తనకు డైరెక్టర్ పదవి రావడానికి సహకరించిన ఎంఎల్‌ఎ సుబ్బరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ సుబ్బరాజు, ధర్మారావులను రజక సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో గుత్తుల బుజ్జి వనచర్ల వెంకట్రావ్ కేశనకుర్తి సురేష్ పత్సమట్ల వెంకటేశ్వర రావు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలో హసన్ బాద గ్రామంలో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్న కారణంగా వాటర్ ట్యాంక్ నుంచి సరఫరా నిలిపివేశారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో గ్రామస్తులకు తాగు నీటికి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికీ ఉచితంగా 20 లీటర్ల తాగునీటి అందజేశారు. జల జీవన్ మిషన్ పనులు పూర్తి అయ్యేవరకు గ్రామ ప్రజలు తాగు నీరుకు ఇబ్బంది కలగకుండా వాటర్ అందించే ప్రయత్నం చేయనున్నట్లు సర్పంచ్ సతీష్ రావు ఈ సందర్భంగా తెలియజేశారు. గ్రామస్తులకు మంచినీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టిన సర్పంచ్‌ను హసన్‌బాద గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాధికారిణి డి.శివ కుమారి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, పోతూరి నాగభూషణం, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, ఎస్.రంగనాథన్ తదితరులు గ్రంథాలయ అభివృద్ధికి చేసిన సేవలను గ్రంథాలయ పాలకురాలు డి.శివకుమారి వివరించారు. విద్యార్థులకు సీనియర్ విభాగంలో డ్రగ్స్ రహిత సమాజంపై చిత్రలేఖన, జూనియర్ విభాగంలో గ్రామీణ వాతావరణం అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీ పరీక్షల్లో 50 మంది విద్యార్థిని, విద్యార్థులు చిత్రలేఖన పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాలకురాలు శివకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జాతీయ సదస్సులో మత్స్యకారుల సమస్యలపై చర్చ

ప్రజాశక్తి - రామచంద్రపురం

మత్స్యకారుల సమస్యలపై జాతీయ సదస్సుల్లో చర్చించామని నేషనల్ స్మాల్ స్కేల్ ఫిష్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు దోమ ఆదినారాయణ తెలిపారు. జాతీయ సదస్సు కలకత్తాలో 16, 17 తేదీల్లో నిర్వహించారని అన్నారు. ఈ సమావేశానికి నాగాలాండ్, అస్సాం, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, బీహార్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, అండమాన్, ఆంధ్రప్రదేశ్, జమ్ము కాశ్మీర్ నుంచి సంఘ సభ్యులు పాల్గొన్నారు ఈ సమావేశంలో ఎపి తరపున డి.పాల్ జనరల్ సెక్రెటరీ డి.పాల్, ప్రెసిడెంట్ డి.ఆదినారాయణ, సెక్రెటరీ చింతా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు వి.కొండబాబు, మల్లాడి వీరపండు హాజరయ్యామన్నారు. ఈ సమావేశంలో ఎన్నో జటిలమైన సమస్యలపై చర్చించుట కొన్ని ముఖ్యమైన సిద్ధాంతపరమైన నిర్ణయాలు తీసుకొన్నామన్నారు. అందులో ముఖ్యంగా సిఆర్‌జెడ్‌కి సంబంధించి, ఆక్వా కల్చర్‌కి సంబంధించి, రైల్వే బ్రిడ్జి కనస్ట్రక్షన్‌కి సంబంధించి విషయాలపై సుదీర్ఘమైన చర్చ జరిగిందన్నారు. రైల్వే బ్రిడ్జిల నిర్మాణాలపై కాపర్‌డామ్ నిర్మించి మత్స్య కారులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. అదేవిధంగా ఇసుక రీచ్ లో మత్స్యకార సొసైటీలకు కేటాయించాలని, విద్య వైద్యం సౌకర్యాలను మత్స్యకారులకు అందేలా ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని మత్స్యకారులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సమావేశంలో కోరినట్లు ఆదినారాయణ 'ప్రజాశక్తి'కి వివరించారు.

సదస్సు లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నాయకులు

ఆటల పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - అల్లవరం

కృష్ణాజిల్లా లో ఇటీవల జరిగిన ఎపిఎస్‌డబ్ల్యూఆర్ జోన్ వన్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో అల్లవరం మండలం గోడి గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపల్ నక్క శ్రీనివాస్ ఆదివారం తెలియజేశారు. కళాశాల స్థాయిలో జరిగిన పోటీలలో ఎస్ సతీష్ కుమార్ జావెలిన్ త్రో, డిస్కస్ త్రోలో మొదటి స్థానం, కె.బాబి డిస్కస్‌త్రోలో రెండవ స్థానం సాధించారన్నారు. పాఠశాల స్థాయిలో సిహెచ్.కిరణ్‌కుమార్ జావెలిన్ త్రో, హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పీడీ వి.నానిబాబు, పిఇటి వై.సుబ్రహ్మణ్యం, విద్యార్థులను ప్రిన్సిపల్ నక్క శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ ఎన్ శ్యామ్ ప్రసాద్, కళాశాల చైర్మన్ బీర భారత్ కుమార్, వైస్ చైర్మన్ యాళ్ళ నాగ లక్ష్మి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు, గోడి గ్రామ సర్పంచ్ తోట శ్రీదేవి, తోట నరసింహరావు, ఎంపిటిసి కాంద్రేగుల వాణి అచ్యుతం, సత్య నారాయణ అభినందనలు తెలిపారు. ఎన్ వేణురాజు క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులు, జి.బాలరాజు ఆర్థికసాయం అందజేశారని, గెలుపొందిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారని ప్రిన్సిపల్ తెలిపారు.

గెలుపొందిన ట్రోఫీతో గోడి గురుకుల పాఠశాల విద్యార్థులు

పంట మార్పిడితో చీడ పీడల నివారణ

'ప్రజాశక్తి'తో వ్యవసాయ శాఖ జెడి విజయ్‌కుమార్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రైతులు ప్రతిసారీ ఒకే రకం పంటను సాగు చేస్తూండటంతో భూసారానికి ముప్పు వాటిల్లుతోంది. ముఖ్యంగా కొన్ని వాణిజ్య పంటలు లాభదాయకంగా ఉండటంతో రైతులు అదే పంటను అదే పొలంలో ప్రతి ఏటా సాగు చేస్తున్నారు. దీనివలన భూసారం క్షీణించడంతో పాటు చీడపీడలు విజృంభించడంతో రైతులకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. అందువల్ల పంట మార్పిడి చేసుకోవాలి' అని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. ఎరువులు, పురుగుల మందుల ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. ఇంకా పలు అంశాలను ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

పంటల మార్పిడి విధానం ఏ విధంగా మేలు.?

గత కొన్నేళ్లుగా పంట దిగుబడులు క్రమేపీ తగ్గుతున్నాయి. ఫలితంగా రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. దీనిని అధిగమించేందుకు పంటల మార్పిడి విధానం మేలని రైతులకు సూచనలు ఇస్తున్నాం. దీనివలన భూసారం పెరిగి మంచి దిగుబడులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఖర్చులు కూడా తగ్గుతాయి. రెండు మూడేళ్లకోసారైనా పంట మార్పిడి చేస్తే చీడపీడలను అదుపులో ఉంచవచ్చు. ఒక పంటను ఆశించే చీడ పీడలు రెండో పంటను ఆశించవు. పంట మార్పిడి విధానంలో రెండు మూడు పంటలు పండించడం వల్ల ఏదైన ఒక పంటకు గిట్టుబాటు ధర దక్కకపోయినా ఇతర పంటల వల్ల తగిన లాభం పొందే అవకాశం ఉంటుంది. అంతే కాదు దిగుబడి కూడా పెంచుకోవచ్చు. రైతులందరూ ఒకే రకమైన పంట సాగు చేయడం వల్ల చీడపీడల ఉధృతి అధికంగా ఉంటోంది.

ఏ విధంగా పంటలను మార్పు చేయాలి.?

భూమిలో తక్కువ లోతుకు వేర్లు చొచ్చుకుపోయే పైర్లను, వేర్లు ఎక్కువ లోతుకు చొచ్చుకుపోయే పైర్లతో మార్పిడి చేయడం వల్ల భూమిలోని వివిధ పొరల్లో ఉన్న తేమ, పోషకాలను మొక్కలు సమర్థంగా వినియోగించుకుంటాయి. పత్తి సాగు చేసిన పొలంలో మిరప పంట వేస్తే లాభసాటిగా ఉంటుంది. మిరప పంట వేసిన పొలంలో పత్తి సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మిరప సాగుకు ముందు భూమిలో జనుము, పిల్లిపెసర వంటివి సాగు చేసి, ట్రాక్టర్ ద్వారా తొక్కిస్తే భూసారం పెరిగి, చీడపీడలు దరి చేరవు. నులిపురుగులున్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేయరాదు. అవి వేస్తే పురుగులు మరింత వృద్ధి చెందుతాయి. నేలంతా పూర్తిగా కప్పే వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము వంటి పంటలనే పంట మార్పిడికి ఎంచు కోవాలి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా నివారించవచ్చు.

తెగుళ్లు ఆశించకుండా ఉండాలంటే ఏం చేయాలి ?

వరి తర్వాత పప్పుధాన్యాలు లేదా నూనె గింజల పంటలు సాగు చేస్తే వరిని తెగుళ్ల ఆశించకుండా ఉంటాయి. భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదికి రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది. తేలికపాటి నేలలు, ఎర్ర ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటలు సాగు చేసుకోవచ్చు. కంది సాగు వల్ల ఆ పైరు ఆకులు రాలి కుళ్లడంతో నేలలో సేంద్రియ పదార్థం పెరిగి, భూసారం వృద్ధి చెందుతుంది. వేరుశనగ, కంది, శనగ వంటి వాటి వేర్ల బుడ్ పెల్లో రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజని స్థిరీకరించి, నేలను సారవంతం చేస్తుంది.

సమీకృత వ్యవసాయం ఎలా చేపట్టాలి.?

రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించేలా



వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ శాస్త్రవేత్తలతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నాం. ఒక ఎకరం భూమిలో ఫిష్ కల్చర్, వరి, కోళ్ల ఫామ్, కూరగాయలు పండించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మెట్ట ప్రాంతంలో బోర్లు అందుబాటులో ఉన్న రైతులు వరికి బదులు రాగులు, కొర్రలు, జొన్న, మొక్కజొన్న, సజ్జలు సాగు చేసుకోవచ్చు. వరి పంట కాలం సుమారు 120 నుంచి 150 రోజులు. అదే చిరు ధాన్యాలు సాగు చేస్తే 30 రోజుల్లోనే పంట కాలం పూర్తవుతుంది. ఫలితంగా ఏడాదికి మూడు పంటలు వేసుకోవచ్చు. ఇలా ఎకరానికి పెట్టుబడి పోను రూ.50 వేల నుంచి రూ.60 వేల ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. అదే వరి సాగు చేస్తే రెండు సీజన్లు కలిపి రూ.25 వేలు మాత్రమే మిగులుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచిస్తున్నాం.

నేరాలు ఘోరాలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 26 మందిపై కేసులు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని పి.మల్లవరం చెక్ పోస్ట్ వద్ద ఆదివారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 26 మందిపై కేసులు నమోదు చేసినట్లు కోరంగి ఎస్ఐ. పి.సత్యనారాయణ తెలిపారు. వాహన తనిఖీల్లో పట్టుబడిన వారిని కాకినాడ సెకండ్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

42 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టణ, మండల పరిధిలోని ఆర్‌బి.కొత్తూరు, గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన దాడుల్లో 42 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో అక్రమంగా నిలవ చేసిన 14 మద్యం బాటిళ్లు, సారా తయారీకి ఉపయోగించే 90 కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసామన్నారు. ఈ దాడుల్లో ఇఎస్‌టిఎఫ్ కాకినాడ సిబ్బంది, పెద్దాపురం ఎక్సైజ్ సిబ్బంది, ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

రెండు రోజుల క్రితం బాలికపై అత్యాచారానికి పాల్పడిన తాడేపల్లిగూడెం మండలం పట్టెంపాలెం గ్రామానికి చెందిన సనమండ్ర కమల్‌ను అరెస్టు చేసి ఆదివారం నిడదవోలు కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ కె.నరేందర్ తెలిపారు. మేజిస్ట్రేట్ నిందితునికి రిమాండ్ విధించినట్టు తెలిపారు. బాలికను సమిశ్రగూడెం హాస్టల్ నుంచి తీసుకువచ్చి చాగల్లు మండలం ధారవరంలో బంధువుల ఇంటికి తీసుకువెళ్లి నిందితుడు అత్యాచారం చేసినట్టు కేసు నమోదు చేశారు. కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ కేసు నమోదైన 30 గంటల్లోపే నిందితుని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని కమిషనర్ భావన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్‌కు ఫోన్లో ద్వారా వచ్చే సమస్యలను నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో నేరుగా ప్రజలు అందించే సమస్యల అర్జీలను స్వీకరిస్తామన్నారు. నగర ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

ఘనంగా అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని మాధవపట్నం గ్రామంలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల మందిరంలో ఆదివారం అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైకుంఠపాళీ, కేరమ్స్, చదరంగం వంటి ఇన్ డోర్ గేమ్స్‌ను నిర్వహించారు. కథలు, చదువు విలువ కథను నాటకీకరణ ప్రదర్శించారు. చిత్రలేఖనం, పాటలు, పద్యాలు, ఒరిగామి అంశాలపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను బాల మందిరం వ్యవస్థాపక అధ్యక్షులు అంగర గోపాలకృష్ణ అందజేశారు.

నిరుపేద కుటుంబాలకు ఆసరా

ప్రజాశక్తి - కరప

మండలం వేలంగి గ్రామంలో నిరుపేద కుటుంబాలకు రూ.10 వేలు విలువ చేసే రేషన్, నిత్యవసర సరుకులు ఆదివారం అందజేశారు. ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఇఒ పేదలకు ఆయా సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసరా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు అలీం, సునంద, సుబ్రహ్మణ్యం, ఇమ్రాన్, దుర్గాదేవి, ప్రశాంత్, సుధాని పాల్గొన్నారు.

ఘనంగా కోత పండుగ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో డాక్టర్ బి ప్రభాకర్, సంఘ కోశాధికారి టి.స్టాలిన్ ధర్మదాస్, పిసిసి, ఎల్‌సిసి ఆధ్వర్యంలో ఆదివారం కోత పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ కోత పండుగ అంటే కృతజ్ఞత పండుగని, హృదయాల సమర్పనే నిజమైన కోత పండుగ అన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు ఎస్‌పి అభినందనలు

ప్రజాశక్తి - కాకినాడ

రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ క్రీడలకు ఎంపికైన జిల్లా పోలీస్ కానిస్టేబుల్స్ పిల్లలను ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అభినందించారు. పోలీస్ కంట్రోల్ రూమ్ కానిస్టేబుల్ కె.రాజేష్ కుమారుడు ఒకతో తరగతి చదువుతున్న కె.హన్షిత్ రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభను చాటుకున్నాడు. అలాగే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్- 2 కానిస్టేబుల్ వి.వీరకృష్ణ కుమారుడు ఐదో తరగతి చదువుతున్న వి.రిషీశ్వర్ రోలర్ స్కేటింగ్ నందు ప్రతిభ చూపిస్తున్నాడు. వీరిద్దరూ ఇటీవల జరిగిన పోటీల్లో పలు మెడల్స్‌ను సాధించారు. డిసెంబర్‌లో కర్ణాటక రాష్ట్రంలోను మైసూరులో జరగబోవు 62వ జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరుపున అండర్-11 విభాగంలో ఎంపికైన వీరిని ఎస్‌పి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోలర్ స్కేటింగ్‌లో ఉత్తమంగా రాణిస్తున్న కానిస్టేబుల్స్ పిల్లలకు పోలీసు శాఖ యొక్క సహాయ సహకరాలను అందిస్తామని అన్నారు.

ఘనంగా కార్తీక వన సమారాధనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ఆదివారం పలు చోట్ల కార్తీక వనసమారాధనలు ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. పలు చోట్ల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

కొత్తపేట: శెట్టి బలిజలు అంతా ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ ,టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. కొత్తపేట ఆర్ఎస్ కళ్యాణ మండపం వద్ద శెట్టిబలిజ కార్తీక వన సమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా టిడిపి అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి దంపతులు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాదిమంది వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. మాజీమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకష్ణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కముజు వెంకటేశ్వరరావు, గుబ్బల సత్తిపండు, రెడ్డి రామకష్ణ, రెడ్డి చంటి, వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** ఐకమత్యానికి ప్రతీకలుగా కార్తీక వన సమారాధన నిలుస్తాయని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వేగుళ్ళ లీలాకష్ణ, లు అన్నారు. ఆదివారం కపిలేశ్వరపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణ లో కపిలేశ్వరపురం గ్రామ శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తొలుత సంఘ పెద్దలు కుటుంబ సమేతంగా ఉసిరి చెట్టుకి పూజలు నిర్వహించి, సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పిటిసి పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ, ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, దుర్గారావు, గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు వర ప్రకాష్ , శెట్టిబలిజ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయ బాబు , ఎంపిటిసిలు శీలం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట ఆర్ఎస్ కల్యాణ మండపం వద్ద జరిగిన వనసమారాధనలో మంత్రి సుభాష్

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా కేంద్రం అమలాపురంలో వివేకానంద సేవాసమితి నేదునూరు వివేకానంద యువత , అఖిల భారత విద్యార్థి పరిషత్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వ్యక్తిత్వ వికాసం పై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. వివేకానంద సేవాసమితి అధ్యక్షులు గొవ్వాల నాగరాజు అధ్యక్షతన పట్టణంలోని స్థానిక సర్ సివి రామన్ పబ్లిక్ స్కూల్ నందు ఈ కార్యక్రమం జరిగింది. ప్రముఖ వ్యాపారవేత్త పి.రవికుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసారు న్యాయవాది ముషిణి రామకష్ణారావు సీనియర్ జర్నలిస్ట్ ఆకుల రవితేజ, పండితుడు ఆ కొండి పవన్, ఎన్ఎం డిసి, సిజిఎమ్ శేఖర్, ఆర్థోపెడిక్ డాక్టర్ కొప్పినీడి రమణ తదితరులు పలు అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు శిక్షణకు సంబందించిన ధ్రువ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సర్ సివి రామన్ విద్యా సంస్థల అధినేత రవణం వేణు, అఖిల భారత విద్యార్థి పరిషత్ సభ్యులు అంజని శ్రీనివాస్, నేదునూరి యువత సభ్యులు కష్ణ, వివేకానంద సేవా సమితి సభ్యులు పెద్దాపురం సిఐ అంకబాబు, పేరి లక్ష్మీ నరసింహం, పేరి లలిత, అజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగ సుధా కొండ, అధిక సంఖ్యలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న సివి రామన్ పాఠశాల అధినేత రవణం వేణు

వరద ముంపు గ్రామాలకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మామిడికుదురు

పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో 10 వరద ముంపు గ్రామపంచాయతీలకు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు చేబ్రోలులో డిప్యూటీ సీఎం పవన కళ్యాణ్ క్యాంపు కార్యాలయములో ఆదివారం ఆయా గ్రామాల సర్పంచ్ లకు చెక్కులు అందజేశారు. ఒక్కొక్క పంచాయతీకి రూ.50 వేల వంతున చెక్కులు అందజేశారు పెదపట్నంలంక, అప్పనపల్లి, పాశర్లపూడి, పాశర్లపూడి లంక, పెదపట్నం, నాగుల్లంక, ఎల్.గన్నవరం, మొండెపులంక, కె.పెదపూడి, ఊడిమూడి గ్రామ పంచాయతీలకు చెక్కులు అందజేశారు. బి దొడ్డవరం పంచాయతీకి తదుపరి జాబితాలో అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఆయా సర్పంచ్‌లు సుందర్నీడి రాజేష్‌కుమార్, గెడ్డం మంగాలక్ష్మి, కొనుకు ప్రేమజ్యోతి, గుబ్బల దుర్గ, యెల్లమెల్లి కష్ణవేణి, పసలపూడి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు

రామ్మూర్తి నాయుడు మృతికి సంతాపం

ప్రజాశక్తి - యంత్రాంగం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎంఎల్ఎ నారా రామ్మూర్తి నాయుడు మృతికి పలువురు ప్రజాప్రతినిధు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆదివారం ఘన నివాళులు అర్పించారు.

అమలాపురం: నారా రామ్మూర్తి నాయుడు మృతికి అమలాపురం టిడిపి నేతల ఆధ్వర్యంలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణ స్వగృహం వద్ద టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: సిఎం నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ ఎంఎల్ఎ నారా రామ్మూర్తి నాయుడు అకాల మరణం విచారకరమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం ద్రాక్షారామలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి సుభాష్ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. నారా రామ్మూర్తి నాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని రామ్మూర్తి నాయుడు చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. **కొత్తపేట:** మాజీ ఎంఎల్ఎ నారా రామ్మూర్తి నాయుడు మరణం చాలా బాధాకరం అని కొత్తపేట ఎంఎల బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం కార్యాలయం వద్ద రామ్మూర్తి నాయుడు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బండారు బులితాత, ముత్యాల బాబ్జీ, బండారు సందీప్, చిక్కం హనుమంతరావు, బండారు రాజేష్,కడియం చిన్న,రెడ్డీ తాతాజీ తదితరులు పాల్గొన్నారు.



రామ్మూర్తి నాయుడు చిత్రపటం వద్ద టిడిపి నేతల నివాళి


దాతను సత్కరిస్తున్న అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయ ఉద్యోగులు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్ కు కడియం వాసులు మదరుపు శ్రీనివాస్ వరలక్ష్మీ దంపతులు మరియు జస్వంత్ ఆదివారం రూ. లక్ష విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రాములతో సత్కరించారు. ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

కాపు వన సమారాధన ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - కొత్తపేట

తెలగా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని బండారు బులిసత్యం, చంద్రావతి కాపు కళ్యాణ మండపంలో ఈ నెల 24న నిర్వహించనున్న కాపు వన సమారాధన ఆహ్వాన పత్రికను స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 24న జరిగే వన సమాధానానికి అత్యధిక సంఖ్యలో సోదర, సోదరీమణులు పాల్గొనాలని కోరారు

మూలేశ్వర స్వామిని దర్శించుకున్న ఎంఎల్ఎ బండారు

ఆలమూరు: మండలంలోని మూలస్థానంలో ఉన్న పార్వతి మూలేశ్వరస్వామి ఆలయానికి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పార్టీ శ్రేణులతో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ మహోత్సవంలో స్వామి వారిని దర్శించుకున్న సత్యానందరావుకు వేదపండితుల ఆశీర్వచనం అందించారు.

మెస్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ

వేతన బకాయిలు చెల్లించాలని కాకినాడ జిజి హెచ్ మెస్ కార్మికులు కోరారు. ఆదివారం స్థానిక జిజిహెచ్‌లో కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ నెలలో సగం రోజులు గడిచినా సెప్టెంబర్, అక్టోబరు నెలల జీతాలు, ఏడు నెలల పిఎఫ్, ఇఎస్ఐ సొమ్మును కాంట్రాక్టర్ ఇవ్వలేదన్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు సమస్యను తెలియజేసిన ఎటువంటి స్పందన లేకుండా పోయిందన్నారు. అందుకు దశల వారి పోరాటం చేయాలని ఈ సమావేశంలో కార్మికులు తీర్మానించినట్లు నాయకులు తెలిపారు. ఈ విషయమై అధికారులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు మలక వెంకటరమణ కోరారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - ఆలమూరు

సిపిఐ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సంయుక్త పిలుపు మేరకు గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను 3 సెంట్లుగా మార్చి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఇంతవరకు ఇంటి స్థలం లేనివారికి స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల శాఖ బికెఎంయు ఆధ్వర్యంలో స్థానిక సమత ఆఫీసు వద్ద ఆదివారం దరఖాస్తులు పూర్తి చేశారు. ఈ దరఖాస్తుదారులను ఈనెల 18న ఆలమూరు సచివాలయం నందు దరఖాస్తులు అందజేయడానికి తరలి రావాల్సిందిగా వారు లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో బికెఎంయు జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ శ్యామ్, సిపిఐ ఆలమూరు శాఖ కోశాధికారి వరలక్ష్మి , మాజీ ఎఐఎస్ఎఫ్ నాయకులు ఆనంద్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సయ్యద్ సైపుల్లా సేవలు అభినందనీయమని సామర్ల కోట ఎంఇఒలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య కొని యాడారు. ఆదివారం యుటి ఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సయ్యద్ సైపుల్లాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక అగస్తనా మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ ఎస్‌జిటిగా పనిచేస్తున్న సయ్యద్ సైపుల్లాకు రాష్ట్ర ఉత్తమ అవార్డు రావడం సామం ర్లకోట మండలానికే గర్వకారణమన్నారు. విద్యార్థులకు ఉర్దూ మీడియంలో పాఠ్యాం శాలు బోధించడానికి పాఠ్యపుస్తకాలు తానే తెచ్చుకుని ఎంతో నిబద్ధత పని చేస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం టి.శ్యాంసుందర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు వై.ప్రభాకర్, బి.మోహన్‌రావు, యుటిఎఫ్ జిల్లా బాధ్యులు పి.గిరిధర్ గోపాలరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు సేవా సంస్థల సాయం

ప్రజాశక్తి - యంత్రాంగం

చికిత్స నిమిత్తం బాధితులకు పలు సేవా సంస్థల సభ్యులు ఆర్థిక సాయం అందించారు.వివరాలు ఇవి..

పి.గన్నవరం: మండలంలోని పితాని వారి పాలెంకు చెందిన కడలి దుర్గారావు కుమారుడు రోహిత్ ఆరోగ్య నిమిత్తం గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి గ్రూప్ సభ్యులు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేసింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ నెడ్ కాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, నాయకులు విత్తనాల ప్రభాకర్, గ్రామ సర్పంచ్ కుడుపూడి లక్ష్మణ్ రావు, పితాని నరేంద్ర, వాకపల్లి చిన్న,కడలి సారథి, కడలి రాంబాబు, మరియు సంస్థ సభ్యులు గుబ్బల గోవర్ధన పద్మ కుమారి, కడలి దొరబాబు తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం:** ఇటీవల సౌదీ దేశంలో తలకు తీవ్రగాయమై వైద్యం చేయించుకొనేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితునికి మనం ట్రస్ట్ చేయూత అందించింది. మండల పరిధి పొడగట్లపల్లికి చెందిన సానబోయిన సాయి సౌదీదేశంలో తీవ్ర గాయాలయ్యాయని వైద్యం కోసం ఎదురు చూస్తున్నారనే సమాచారం మనం ట్రస్ట్ ఇంచార్జ్ గండ్రోతు దుర్గాదేవి తెలుసుకున్నారు. బాధితుని గహాన్ని సందర్శించి దాతలు సహకారంతో నగదు రూ.41వేలు పిఇటి టేకి రామకృష్ణ చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బాధితునికి తమ వంతు గా సహకారం అందించిన దాతలకు మనం ట్రస్ట్ ఇంచార్జ్ దుర్గాదేవి కృతజ్ఞతలు తెలియచేసారు. బాధితుని వైద్యం నిమిత్తం దాతలు సహరించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

పితానివారిపాలెంలో 'గల్ఫ్ యువనేస్తం' ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

పొడగట్లపల్లిలో బాధితునికి మనం ట్రస్ట్ ఆర్థిక సాయం

ఐదు వేల మందికి ప్రసాద వితరణ

ప్రజాశక్తి - కె. గంగవరం

కార్తీక మాసం సందర్భంగా ద్రాక్షారామంలోని ప్రసన్నాంజయనేయస్వామి ఆలయానికి ఆదివారం వచ్చిన ఐదు వేల మంది యాత్రికులకు పూర్వ విద్యార్థులు ప్రసాద వితరణ చేశారు. 1988-89 టెన్త్ క్లాస్ ఎస్‌పివిఆర్ హైస్కూల్ పూర్వ విద్యార్థిని, విద్యార్థుల ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం ఐదు వేలమందికి వితరణ చేశామని ఎపి ఐ డిసి మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ తెలిపారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పసుమర్తి రంగనాయకులు, తుమ్మూరి రాంబాబు, చిక్కాల నాగబాబు, వాసంశెట్టి బాపూజీ, ఈత రాంబాబు, కొండమూరు సూరిబాబు, సల్మాన్ హుస్సేన్, గొడవర్తి సాయి, డేగల రమేష్, దాసరి పెరుమాళ్ళు, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులకు ప్రసాద వితరణ చేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రకటన

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం నియోజకవర్గం, అల్లవరం మండలం గుండెపూడి గ్రామం పోతులవారి పేట వాస్తవ్యుడు విప్పర్తి నవీన్ తెలియజేయునది ఏమనగా,

విప్పార్తి నవీన్ అను నాకు నా భార్య శ్రీజ లకు పుట్టిన నా కుమారుడు జననం మా గ్రామమైన గుండెపూడి పంచాయితీలో నమోదు కాలేదు. నా కుమారుడు విప్పర్తి హర్షవర్ధన్ 22-12-2021 న జన్మించారు. ఎవరికైన ఏమైన అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: విపర్తి నవీన్
S/o. విప్పర్తి రామారావు, డోర్ నంబర్ 2-24
గుండెపూడి, పోతుల వారి పేట,
అల్లవరం మండలం, Pin-533217,
సెల్ నెంబర్: 9177286540